# పెను భూతం

-వాణిశ్రీ

సుధాకర్ అమరావతికి వెళ్లాడు తల్లిదండ్రులతో కలసి. బస్ దిగగానే శంకరయ్య కనిపించాడు. సుధాకర్ తండ్రి గోపాలరావు స్నేహితుడు శంకరయ్య. అతనే ఈ ఊళ్లో సుధాకర్‌కి పెళ్లి సంబంధం చూసింది. సుధాకర్ మెకానికల్ ఇంజనీరు. సిమెంట్ ఫ్యాక్టరీలో పని చేస్తున్నాడు.

"ఎక్కడోయ్ నరహరి ఇల్లు?" అడిగాడు గోపాలరావు స్నేహితుడ్ని.

"దగ్గరే. కారెక్కండి" అన్నాడు శంకరయ్య.

"దగ్గరే అయితే నడిచిపోవచ్చుగా? మళ్లీ కారెందుకోయ్ దండగ" అన్నాడు గోపాలరావు.

"పెళ్లిచూపులకెళ్తూ నడిచివెళ్తే ఏం బావుంటుంది?" అని నవ్వాడు శంకరయ్య.

"బాగుండేది ఏమిటోయ్? నడిచి వెళ్తే కట్నం తక్కువ ఇస్తారా ఏం?" అన్నాడు గోపాలరావు.

"అన్నయ్యగారూ! ఇప్పటివరకూ బస్సులో కూర్చుని కూర్చుని ఆయనకు కాళ్లు పట్టేసి ఉంటాయి. అందుకే నడవాలని సరదా పడుతున్నారు" అన్నది గోపాలరావు భార్య పద్మావతి.

"అదా సంగతి. ఐతే ఒక పని చేయవోయ్. మేము కార్లో బయల్దేరుతాం. నువ్వు వెనుకే పరుగెత్తుకుంటూ రా'' అన్నాడు శంకరయ్య నవ్వుతూ.

"ఒక్కడ్నే ఏం పరుగెత్తుతాను? నువ్వు కూడా తోడురా! ఇద్దరం కబుర్లు చెప్పుకుంటూ పరుగెత్తుదాం. మన చిన్నప్పుడు తోటలో మామిడికాయలు దొంగతనంగా కోస్తుంటే తోటమాలి వెంట పడినప్పుడు ఎంత స్పీడుగా పరుగెత్తాం? గుర్తుందా నీకు?'' అన్నాడు గోపాలరావు పకపకా నవ్వుతూ.

"అటువంటి కొంటె చేష్టలన్నీ భలే గుర్తుంటాయిలే నీకు. చాల్లే కారెక్కు'' అన్నాడు శంకరయ్య ముందు సీట్లో కూర్చుంటూ.

అంతా కారెక్కారు. పెళ్లివారిల్లు వచ్చింది. అమ్మాయి తండ్రి నరహరి కారు ఆగగానే హడావుడిగా వచ్చి ఆహ్వానించాడు.

కాళ్లకు నీళ్లిచ్చి టర్కీ టవల్స్ అందించి "ప్రయాణం బాగా జరిగిందా అన్నయ్యగారూ! వదినగారూ రండి'' అని నరహరి భార్య వరసలు కలిపేసింది.

హాల్లో వున్న సోఫాలో కూర్చున్నారు. సుధారాణిని తీసుకువచ్చి వాళ్ల ఎదురుగా చాపమీద కూర్చోబెట్టారు. అమ్మాయి అందంగా ఉందని సుధాకర్ తృప్తిపడ్డాడు. పద్మావతి చిన్న చిన్న ప్రశ్నలతో సుధని పలకరించింది. అందరికీ అమ్మాయి నచ్చింది. గోపాలరావు శంకరయ్యకి ఆ విషయం చెప్పేసాడు. నరహరి లోపలకు పిలిచాడు శంకరయ్యని. అమ్మాయి నచ్చింది కాబట్టి కట్న కానుకల గురించి మాట్లాడుకున్నారు.

సుధారాణి తలపైకెత్తి చూసి "ఏమండీ! మీతో పర్సనల్‌గా మాట్లాడాలి నేను'' అన్నది సుధాకర్‌ని ఉద్దేశించి.

సుధాకర్ తల్లిదండ్రులవైపు చూసాడు ప్రశ్నార్థకంగా.

"ఇందులో తప్పేముంది? వెళ్లి మాట్లాడు'' కొడుకుతో అన్నాడు గోపాలరావు.

నరహరి కూతురివైపు కోపంగా చూసాడు.

సుధారాణి వెనుకే వెళ్లాడు సుధాకర్. ఇద్దరూ గదిలో కూర్చున్నారు. సుధారాణి తలుపువైపు అనుమానంగా చూస్తూ ఉంది.

అతను గమనించివెళ్లి బోల్టు వేసాడు.

"మన మాటలు ఇప్పుడు ఎవరికీ వినబడవు. ఏమిటి నాతో మాట్లాడాలన్నావు?'' అన్నాడు సుధాకర్.

"నేను మీకు నచ్చానా?'' అడిగింది సుధారాణి.

"ఔను. నాకేకాదు, మా అమ్మానాన్నలకు కూడా నచ్చావు.''

"ఐతే పెళ్లికి ముందు నేను ఒక విషయం మీతో చెప్పాలి.''

"ఏమిటి?''

"నేను ఇంటర్ పరీక్షలు అయిన తరువాత మా మేనమామ వాళ్ల వూరు చిలుమూరు వెళ్లాను. అక్కడ నెలరోజులున్నాను. అప్పుడు శ్రీరామ్ నాకు పరిచయమయ్యాడు. మేమిద్దరం ప్రేమించుకున్నాం. కానీ కులం ఒకటి కాదని మా మేనమామలు, మా నాన్న వాళ్లు పెళ్లికి ఒప్పుకోలేదు. ఈ పెళ్లి చేసుకుంటే కృష్ణలో దూకి చస్తానని మా నాన్న బెదిరించాడు. నువ్వు లేచిపోయి కులం తక్కువవాడిని చేసుకుంటే నీ తరువాత ఇద్దరు చెల్లెళ్లున్నారు. వాళ్లకి పెళ్లిళ్లు ఎలా అవుతాయి? మేమంతా కట్ట కట్టుకుని చావాల్సిందే అని అమ్మ ఏడ్చింది. ఈ పరిస్థితుల్లో నేను శ్రీరామ్ వెంట వెళ్లిపోయి పెళ్లి చేసుకున్నా సుఖపడేది ఏమీ లేదనిపించింది. అమ్మా నాన్నా ఏదైనా అఘాయిత్యం చేసుకుంటే నేను జీవితాంతం కుమిలిపోవాల్సిందేగదా? అందుకని రాజీ పడిపోయాను. ఈ విషయం ఎవరో మీకు చెప్పి లేనిపోని అనుమానాలు రేకెత్తించేబదులు నేనే చెప్పడం న్యాయం అనిపించి చెప్తున్నాను'' అంది సుధారాణి.

సుధాకర్‌కి ఆమె నిజాయితీ నచ్చింది. అమరావతి వంటి చిన్న ఊళ్లో పుట్టి పెరిగిన అమ్మాయి ధైర్యంగా అసలు సంగతి చెప్పినందుకు ముచ్చటేసింది.

"నీ నిజాయితీ నాకు నచ్చింది సుధా'' అన్నాడు సుధాకర్.

సుధారాణి అతనివైపు కృతజ్ఞతతో చూసింది.

★★★

పెళ్లయిన తరువాత సుధాకర్ పని చేస్తున్న సిమెంట్ ఫ్యాక్టరీ క్వార్టర్స్‌లోకి కాపురానికి



వచ్చింది సుధారాణి. అక్కడ ఆమెకు హాయిగా ఉంది వాతావరణం. ఆరునెలలు గడిచాయి. ఒకరోజు సుధాకర్ క్వార్టర్ నుంచి ఫ్యాక్టరీకి వెళ్తుంటే దారిలో పోస్టుమాన్ కనబడ్డాడు.

"సార్! సుధారాణి మీ మిసెస్ కదూ'' అని అడిగాడు.

"ఔను''

"ఒక లెటర్ రిటర్న్ వచ్చింది'' అంటూ ఒక కవరు చేతిలో పెట్టాడు పోస్టుమాన్.



సుధాకర్ అడ్రస్ చూసాడు. శ్రీరామ్, కేరాఫ్ సత్యానందం, చిలుమూరు, తెనాలి తాలూకా అని వుంది. అడ్రస్‌లో శ్రీరామ్ లేడు. అందువలన తిప్పిపంపడమైనది అని రాసి వుంది.

శ్రీరామ్‌ని ప్రేమించిన సంగతి తనకు ముందుగానే చెప్పింది సుధారాణి. ఆమె నిజాయితీకి మెచ్చుకున్నాడు తను. అందుకే ఏమాత్రం అభ్యంతరం చెప్పకుండా పెళ్లి చేసుకున్నాడు. ఏకాంతంలో ఏం మాట్లాడుకున్నారని తల్లిదండ్రులు అడిగినా తను చెప్పలేదు. మామూలు విషయాలే అని దాటవేసాడు. మరి ఇప్పుడు శ్రీరామ్‌కి సుధ లెటర్ రాయవలసిన అవసరం ఏమిటి? సుధ అతన్ని మర్చిపోలేకపోతున్నదా? సుధాకర్ కవర్ చించి సుధారాణి, శ్రీరామ్‌కి రాసిన లెటర్ చదివాడు. తమ ప్రేమ కులాలు వేరు కావడంవలన ఫలించలేదనీ, తను రాజీపడి పెళ్లి చేసుకున్నాననీ, పెళ్లికి రమ్మని లెటర్ రాసినా శుభలేఖ పంపినా నువ్వు రాలేదని నిష్ఠూరంగా రాసింది. ఇప్పుడు తను సుఖంగానే ఉన్నాననీ, తనకిప్పుడు ఆరోనెల గర్భమనీ, నువ్వు కూడా నన్ను మర్చిపోయి పెళ్లి చేసుకుని సుఖంగా ఉండమనీ అందులో వుంది. సుధాకర్‌కి ఆ లెటర్ చదివిన తరువాత మనసంతా అదోలా ఉంది. అనుమానం అనే పెనుభూతం మనసులోకి ప్రవేశించింది.

'సుధారాణి ఇప్పుడు గర్భవతి. ఐతే పెళ్లికి ముందే ఆమె గర్భవతి ఏమో? ఆమె కడుపులో బిడ్డకి శ్రీరామ్ తండ్రేమో?'

సుధాకర్ అశాంతికి గురయ్యాడు. సుధారాణి తన మాజీ ప్రియుడికి పెళ్లి చేసుకుని సుఖంగా ఉండమని కోరడం వరకూ బాగానే వుంది. తను గర్భవతి అని అతనికి తెలియజెప్పవలసిన అవసరం ఏమిటి? పరోక్షంగా నా కడుపులో పెరుగుతున్నది నీ బిడ్డే అని తెలియజేయడమా?

సుధాకర్‌కి నిద్ర పట్టడంలేదు. సుధారాణిని నిలదీయాలని అనుకున్నాడు. కానీ ఆమె నిజం చెబుతుందా? తనకు శ్రీరామ్‌తో శారీరక సంబంధం ఉందని ఎందుకు అంగీకరిస్తుంది? ఎంత తెలివితక్కువ ఆడదైనా తన కాపురం కూల్చుకోదు. అసలు సుధారాణి నిజాయితీ బూటకమేమో? ఆమె ప్రేమ వ్యవహారం పూరంతా తెలిసి ఉంటుంది. పెళ్లయిన తర్వాతైనా ఎవరో ఒకరు తనకి చెప్పే ప్రమాదం ఉందని ఊహించి తనే చెప్పేసి ఉంటుంది. సుధారాణి చాలా తెలివైనదానిలా అనిపిస్తోంది ఇప్పుడు. డిఎమ్ఎ టెస్టు చేయిస్తే తెలుస్తుందిగా? అదంతా శిశువు పుట్టిన తరువాత కదా? ముందుగా ఎలా తెలుసుకోవడం? ఇదంతా ఎందుకు? అసలు శ్రీరామ్‌ని కలుసుకుని నిజం తెలుసుకుంటే? సుధాకర్ చిలుమూరు బయలుదేరాడు.

***

"సుధా! నేను చిలుమూరు వెళ్తున్నానోయ్" అన్నాడు సుధాకర్.

సుధారాణి ఆశ్చర్యపడింది.

"ఎందుకండీ?" అని ప్రశ్నించింది.

"ఆ ఊళ్లో అరవై ఏళ్ల క్రితమే రెసిడెన్షియల్ స్కూల్ మొదలైందట కదా? ఆ మారుమూల పల్లెటూరిలో ఎప్పుడో అరవై ఏళ్ల క్రితమే గురుకుల పాఠశాల స్థాపించడం అద్భుతం కదూ? అక్కడే ఎందుకు మొదలుపెట్టారో తెలుసుకుని ఒక ఆర్టికల్ తయారు చేయాలని నా జర్నలిస్టు ఫ్రెండ్ చాలా ఇంట్రెస్టుగా ఉంది. ఎటూ ఆ ఊళ్లో మీ మేనమామలు ఉన్నారుగా? అందుకని నేనే వెళ్లి అవన్నీ కనుక్కుని వస్తానని ప్రామిస్ చేసాను" అన్నాడు సుధాకర్.

తను చెపుతున్నంతసేపూ సుధారాణి ముఖ కవళికలు గమనిస్తున్నాడు. ఆమె ఏమైనా కలవరపడుతోందో? భయపడుతోందా? అని. కానీ ఆమె మామూలుగానే ఉంది. భయపడుతున్నట్లు అనిపించడంలేదు.

"సరేనండీ. మా మేనమామ మీకు పరిచయమేగా? రత్నం కనకయ్యగారిల్లు అంటే ఎవరైనా చూపిస్తారు?" అంది సుధారాణి.

***

సుధాకర్ కనకయ్య ఇంటికి వెళ్లాడు. మేనకోడలి భర్త తమ వూరు రావడం చాలా ఆశ్చర్యం కలిగించింది. సుధారాణికి చెప్పిన విషయమే వాళ్లకీ చెప్పాడు. కనకయ్యను తీసుకువెళ్లి అక్కడివారందరికీ పరిచయం చేసుకున్నాడు. గురుకులం గురించిన వివరాలు నోట్ చేసుకున్నాడు.

ఆ తరువాత శ్రీరామ్ గురించి తెలుసుకోవాలని బయల్దేరాడు. సత్యానందం మాస్టారు గురించి ఎంక్వయిరీ చేసాడు. ముందు పోస్టు మాస్టర్ ఇంటికి వెళ్లాడు.

"ఏమండీ! సత్యానందం మాస్టారు ఇల్లు ఎక్కడండీ? నేను వారిని కలవాలని వచ్చాను. మీకు ఊళ్లో అందరి గురించి తెలుస్తుంది కదా అని అడుగుతున్నాను. ఏమీ అనుకోకండి" అన్నాడు.

పోస్టుమాస్టర్ నవ్వాడు.

"ఇందులో అనుకోవడానికి ఏముందిలెండి? సత్యానందం మాస్టారు ప్రస్తుతం ఈ ఊళ్లో ఉండడంలేదు. గుంటూరు వెళ్లిపోయారు ఇల్లు ఖాళీ చేసి" అన్నాడు.

"అయ్యో అలాగా!"

"మీకు ఆయన బంధువా?"

"కాదండీ. వాళ్లబ్బాయి శ్రీరామ్ నాకు ఫ్రెండ్."

"అలాగా. పాపం మంచి కుర్రాడు. అర్థాంతరంగా పోయాడు. చేతికి అంది వచ్చిన కొడుకు పోతే ఎవరికైనా గుండె కోతే కదండీ"

"ఏమిటి సార్ మీరనేది?"

"అంటే మీకు శ్రీరామ్ చనిపోయిన విషయం తెలియదన్నమాట. ఇంకా నేను తెలుసనుకుంటున్నాను. ఆయన్ని పరామర్శించడానికి వచ్చారనుకుంటున్నాను."

"నిజంగా నాకు తెలియదు సార్. పావం ఎలా పోయాడు?"

## గడియారాల చెట్టు

ఇండోర్ జిల్లా బర్మావియా గ్రామంలో ఒక మర్రిచెట్టుకి వందలాది గడియారాలు వ్రేలాడుతూ ఉంటాయిట. ఆ చుట్టుపక్కల ఊళ్ల జనాలు తమ కేవో మొక్కులు తీర్చమని ఆ చెట్టని ప్రార్థిస్తారుట. తమకి పిల్లలు కావాలనో, దీర్ఘరోగాలు తగ్గాలనో, వ్యాపారంలో లాభాలు రావాలనో - కోరిక ఏదయినా సరే మొక్కుకున్న వాళ్ల కోరికలు తప్పకుండా తీరతాయిట. దానికి కృతజ్ఞతగా వాళ్లు క్లాక్‌నో, రిస్ట్‌వాచీనో తెచ్చి ఆ చెట్టుకి కడతారట. మరీ పేద వాళ్లయితే కొబ్బరికాయకొట్టో, అగరువత్తులు వెలిగించటమో చేస్తారుట! కాని, కోరికలు తీరని వాళ్లు లేనేలేరుట. మరో చిత్రమేమంటే ఆ చెట్టునున్న గడియారాలని ఎవరూ దొంగిలించరుట!


## ఫిష్ థెరపీ

చైనాలోని నాషియన్ హాట్‌స్ప్రింగ్ రిసార్ట్ దగ్గర టూరిస్టులు 'ఫిష్ థెరపీ' చేయించుకుంటారుట! హాట్ స్ప్రింగ్‌లోని వేన్నీళ్ళకి చర్మం మెత్తబడటంతో చనిపోయిన కణాలని చేపలు తినివేస్తాయిట. ఆ థెరపీ చేయించుకున్నవారి చర్మం చక్కగా నిగనిగలాడుతుందిట.

## నత్తకి పళ్ళెన్ని?

ఒక నత్తకి సుమారు 20000 పళ్లుంటాయిట!

-తటవర్తి



"పాపం పుణ్యం ఆ దేవుడికే తెలియాలి? కృష్ణలో అతని శవం దొరికింది."

"అయ్యో ఏం జరిగి వుంటుందంటారు?"

"శ్రీరామ్ ఒకమ్మాయిని ప్రేమించాడట. కులాలు వేరని పెద్దవాళ్లు ఒప్పుకోలేదు. అందుకని ఆత్మహత్య చేసుకున్నాడంటారు. కొందరేమో..." అని ఆగాడు.

"ఏమిటి సార్ ఆగిపోయారు? వాడు ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదే?"

"నాకూ సరిగ్గా తెలీదు. అన్నీ వూళ్లో పుకార్లే."

"ఏమిటి సార్ అవి? ఏమనుకోకండి. కేవలం కుతూహలంతో తెలుసుకోవాలని అడుగుతున్నాను. ఐనా తెలుసుకుని చేసేది మాత్రం ఏముంది? ఘోరం జరిగిపోయింది" అన్నాడు సుధాకర్ విచారిస్తూ.

"ఔను బాబూ... ఏమిటో అంతా కలికాలం. ఆ పిల్లతో పెళ్లి కాలేదని, భరించలేక కృష్ణలో పడ్డాడంటారు. ఆ పిల్ల తాలూకా వాళ్లు చంపి కృష్ణలో పడేసారని కొందరంటారు? జరిగింది ఏమిటో ఆపైన భగవంతునికి తెలియాలి" అన్నాడు.

"ఇంతకీ ఎవరు సార్ ఆ అమ్మాయి?"

"ఎవరైతే ఏంలే" అని చెప్పకుండా దాటవేసాడు పోస్టుమాస్టర్.

***

సుధాకర్ తిరుగు ప్రయాణమయ్యాడు. శ్రీరామ్ మీద సానుభూతి కలిగింది. సుధారాణి మేనమామలు ఆ వూళ్లో బలవంతులు, భూస్వాములు. సత్యానందం మాస్టారు పొట్టకూటి కోసం వచ్చిన బలహీనుడు. బలవంతుడికి ఎదురు నిలిచి, ఇష్టంలేని పనిచేసి మనుగడ సాగించలేడు. శ్రీరామ్ ఆత్మహత్య చేసుకున్నాడా? లేక అతను హత్యకు గురయ్యాడా? అన్నది పోస్టుమాస్టర్ అన్నట్లు నిజం ఆ దేవుడికే తెలియాలి. అది ఎప్పటికీ బయటపడదు. అలాగే సుధారాణికి , శ్రీరామ్‌కి శారీరక సంబంధం ఉన్నదా? లేదా అన్నది కూడా జీవితాంతం సస్పెన్స్‌గానే ఉండిపోతుంది.

సుధారాణి నిజాయితీపరురాలైతే తనకు ఆ విషయం కూడా చెప్పి ఉండాల్సింది కదా? కానీ తను అడగలేదు. అడిగితే చెప్పేదేమో? అసలు అటువంటివి అడగడం సభ్యతేనా? కాలం మారుతోంది. లోకంలో ఎందరో విడాకులు ఇచ్చిన అమ్మాయిల్ని, విధవ అయిన స్త్రీలను, ఆమె పిల్లలతో సహా చేరదీస్తున్నారు. పెళ్లిళ్లు చేసుకుంటున్నారు. వాళ్లంతా హాయిగా కాపురాలు చేసుకుంటున్నారు. తను కేవలం ఊహాజనితమైన అనుమానంతో ఎందుకు కలవరపడుతున్నాడు? ఇందులో సుధారాణి తప్పేమిటి? యుక్త వయసులో వున్న ఆడపిల్ల ఒక యువకుడి ఆకర్షణలో పడడం తప్పేలా అవుతుంది? తను మాత్రం ఎందరి ఆడపిల్లల ఆకర్షణలో పడలేదు? ఐతే అవి పెళ్లివరకు రాకపోవడం వేరే విషయం.

సుధాకర్‌లో సంఘర్షణ జరుగుతోంది. బస్సులో ప్రయాణం చేస్తున్నంతసేపూ ఏవేవో ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నాయి. శ్రీరామ్ బతికి వుంటే సుధాకర్ మనసులోకి ప్రవేశించిన అనుమానమనే పెనుభూతం అతన్ని కబళిస్తూ ఉండేది. అతని సంసారంలో కలతలు రేపేది. శ్రీరామ్ ఇక లేడు అన్న విషయం తెలిసిన తరువాత సుధాకర్ మనసు క్రమంగా మారిపోయింది. ఇందులో ఎవరి తప్పూలేదు. పరిస్థితుల ప్రభావం. జరిగినదంతా పీడకల అనుకున్నాడు. ఐతే సుధారాణికి సుధాకర్ నిజం చెప్పాలా? ఆమె శ్రీరామ్ గురించి అడిగితే ఏం చెప్పాలి? అసలు ఆమెకు శ్రీరామ్ చనిపోయిన విషయం తెలియదా? తెలిస్తే అతనికి లెటర్ ఎందుకు రాస్తుంది? ఒకవేళ శ్రీరామ్ చనిపోయాడనే విషయం తెలిసి షాక్ తిన్నదేమో? జరిగింది మర్చిపోయిందేమో? అతను జీవించే వున్నాడనే భ్రమలో ఉందేమో?

ఇప్పుడు తను శ్రీరామ్ చనిపోయాడనే నిజం ఆమెకు చెప్తే?

ఎందుకు చెప్పడం? చెప్పి ఆమెను బాధ పెట్టడం ఎందుకు? శ్రీరామ్ బ్రతికే ఉన్నాడనే భ్రమలో ఉండనీ అనుకున్నాడు సుధాకర్. లేకపోతే తన వల్లే శ్రీరామ్ చనిపోయాడని జీవితాంతం బాధపడుతుంది.

సుధాకర్ ఇల్లు చేరుకున్నాడు. సుధారాణి ఎదురువచ్చింది. ఆమె ముఖం కళకళలాడుతోంది. ఆమె అప్పుడే వికసించిన అందమైన పువ్వులా ఉంది. ఆమెలో ఏ కల్మషం గోచరించడంలేదు.

"మా మామయ్యావాళ్లు బాగున్నారా?" అని అడిగింది సుధారాణి.

"అంతా బాగున్నారు. నిన్ను అడిగానని చెప్పారు."

"మీరెళ్లిన పని పూర్తయిందా?"

"ఓ... మంచి ఆర్టికల్ తయారైంది" అన్నాడు సుధాకర్ నవ్వుతూ.

★



## ఇదే నిజమైతే!

రజనీకాంత్, కమల్‌హాసన్‌లతో కలిసి నటించాలని ఏ హీరోయిన్ మాత్రం ఆశపడదు చెప్పండి? 'శివాజీ' సినిమాలో హీరోయన్‌గా నటించిన శ్రియకి రజనీతో కలిసి నటించిన ఆనందం మాటల్లో చెప్పలేనంది చెప్పలేనంది. ఇప్పుడు మరో మంచి అవకాశం ఆమెని వెదుక్కుంటూ వస్తున్నట్లే వుంది. 'మర్మయోగి' సినిమాలో కమల్‌తో శ్రియ నటించవచ్చునని చెన్నయ్ సినీ వర్గాలు చెప్పుకుంటున్నారు. ఇదే నిజమైతే శ్రియ సంతోషం అంతా ఇంతా కాదు మరి! నిజమేకదా!

